క్లుప్తంగా

ఆర్టీసీ కార్గో సేవలు ఉపయోగించుకోవాలి

ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు

దాచేపల్లి : ఆర్టీసీ కార్గో సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. ముక్తేశ్వరరావు అన్నారు. దాచేపల్లి పాత బస్టాండ్ సెంటర్‌లో సోమవారం కార్గో సేవల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్గో సేవల ద్వారా ప్రజలకు సులభతరమైన పార్శిల్‌ను అందిస్తామని, వేగవంతంగా పార్శిలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాజవరపు రాజా నరేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

గురజాల : గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని పల్లెగుంత గ్రామ సర్పంచ్ వంకాయలపాటి మల్లయ్య అన్నారు. మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో మోడల్ పాఠశాల వెళ్ల రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి సంక్షేమం రెండు సమానంగా చూపుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. ఎమ్మెల్యే కాసు దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన వెంటనే పరిష్కరించే విధంగా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ సిద్దావలి, గ్రామ కార్యదర్శి తెల్లా గురుప్రసాద్, పేరుపోగు వరంబాబు, పాఠశాల హెచ్ఎం ఉషారాణి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

కారెంపూడి: రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని వాహనాలు నడిపేవారు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలను నివారించాలని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ కోరారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం రాత్రి ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా తల్లిదండ్రులు గారాబంతో పిల్లలకు బైక్‌లు నడిపే అవకాశం ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్లు భద్రతా ప్రమాణాలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని, వాహనాల తనిఖీల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని సీఐ జయకుమార్ హెచ్చరించారు.

నేడు కానుకమాత చర్చి జండా ఆవిష్కరణ

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 173వ తిరుణాళ్ల మహోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30 గం.లకు సాగరుమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ పామిశెట్టి జోసఫ్ సాగర్ జండాను ఆవిష్కరించనున్నట్లు కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫాదర్ లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ జండా ఆవిష్కరణ అనంతరం 1850 సం.లో నిర్మించిన అతిపురాతనమైన కానుక మాత దేవాలయం ప్రాంగణంలో రెవ.ఫాదర్ పామిశెట్టి జోసఫ్ సాగర్‌చే నిర్వహించే దివ్య పూజాబలితో పండుగ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రతి రోజు గ్రామంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4.30 గంటలకు నవదిన ప్రార్థనలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ నవదిన ప్రార్థనలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కానుకమాత దీవెనలు పొందాలని ఫాదర్ లూర్దు మర్రెడ్డి కోరారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

మాచర్ల రూరల్: ప్రజా స్వామిక దేశాల్లో భారత దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్న ఓటు వినియోగంలో యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొనేలా వారిని చైతన్యపర్చాలని తహసీల్దార్ జి రమేష్ కుమార్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18సం''రాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులకు ఓటు నమోదు చేసి వారు ఓటు హక్కు వినియోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా ఓటు నమోదైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ కార్డు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం 70సం''రాలు నిండిన ఓటర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి షేక్ భాష, డిప్యూటీ తహసీల్దార్ శ్రీవాణి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఆర్ఐ ఫణీందర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అసైండ్ భూములను పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది

పిడుగురాళ్ల: మండలంలోని కామేపల్లి గ్రామంలో సాగు చేస్తున్న రైతులకు డీకే పట్టాలు ఇచ్చేందుకు సర్వే నంబర్ 1 ప్రభుత్వ పోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. దీనిలో భాగంగా మండల సర్వేయర్ శ్రీనివాసరావు రైతులతో మాట్లాడుతూ ఎవరు సాగు చేస్తున్న భూమిలో వారు హద్దులు, జెండాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సర్వే నంబర్ 1 భూమి విస్తరణ ఎంత ఉందో నికరం తేల్చి సాగు చేస్తున్న రైతులకు డీకే పట్టాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సాగులో ఉన్న రైతులందరు తమకు సహకరించాలని, రెండు, మూడు రోజుల్లో కొలతలు చేపట్టి రైతులకు డీకే పట్టాలు అందజేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ సత్యనారాయణరెడ్డి, వీఆర్వోలు ముక్కంటి, మురళి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ


పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ

గురజాల : ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ అన్నారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో ఎన్‌హెచ్ఎం మరియు ఏపీహెచ్ఎస్ఎస్‌పి నిధులతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజనీ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ వైద్యశాలలో అన్ని సదుపాయాలు కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ వర్తించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. వైద్యో నారాయణో హరి అన్న నినాదాన్ని నమ్మిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జంగమహేశ్వరపురంలో 10 పడకల వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగిందని వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యం పరంగా ఎవరికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో సిబ్బందిని నియమించి వైద్యసేవలు అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీతో పాటు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, విప్ కుక్కమూడి అనిల్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, వి అమరారెడ్డి, శౌరెడ్డి, వేలమూరి సైదారెడ్డి, పీర్ అహ్మద్, మేకల శేషిరెడ్డి, తదితరులున్నారు.

టోర్నమెంట్‌తో యువతను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: తెలుగు సాంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ప్రతిసారీ వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో నియోజక వర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు వివిధ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ నేత వేముల దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఎస్‌కెబిఆర్ కాలేజి గ్రౌండ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల సందర్భంగా విజేతలకు పీఆర్కే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుని ప్రోత్సహించే విధంగా అనేక సంవత్సరాలుగా వేముల దుర్గ వివిధ క్రీడలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆటవిడుపుగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతిని రూ. 12016 వేముల దుర్గా ద్వారా, ద్వితీయ బహుమతిని రూ. 6016లు, తృతీయ బహుమతిని రూ. 3016 వేముల దుర్గా ద్వారా, రూ. 1016ను విజేతలకు నగదుతో ట్రోఫీలను పీఆర్కే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, శ్రీలక్ష్మీచెన్నకేశవ ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చల్లా శ్రీను, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ టి బాలకృష్ణ, రూరల్ సీఐ షేక్ షమీముల్లాతో పాటు నిర్వాహకులు, దుర్గ, సాయి, ఎం జాన్, చిన్నితో పాటు క్రీడాకారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రణక్షేత్రంలో కొలువుదీరనున్న కన్నమదాసు విగ్రహం


కన్నమదాసు మేడ ప్రాంతం

కారెంపూడి: అలనాటి పల్నాటి వీరుడు మాచర్ల సర్వ సైన్యాధ్యక్షుడు కన్నమదాసు విగ్రహం ఏర్పాటు పనులు పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆలోచన మేరకు మాలజన సేవా సమితి సభ్యులు దానికి కార్యరూపం ఇస్తున్నారు. కన్నమదాసు మేడ చుట్టూ ప్రహరీ గోడ కట్టి లోపల మెరక తోలించారు. మేడకు తూర్పున కన్నమదాసు విగ్రహం ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. విగ్రహాన్ని మర్రి శేషయ్య ఏర్పాటు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు దాతలు సహకారం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే అక్కడున్న కన్నమదాసు మేడను పరిరక్షించాల్సిన ఆవశ్యకత కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడున్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా వేరే చోటికి మారిస్తే మరింత సైకర్యంగా ఉంటుంది. కన్నమదాసు విగ్రహం ఏర్పాటైతే రణక్షేత్రం మరింత చారిత్రక శోభను సంతరించుకుంటుంది.

వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం


ప్రత్యేక అలంకారంలో వాసవి అమ్మవారు


ఆలయంలో పూజలో పాల్గొన్న సభ్యులు

రెంటచింతల: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ శర్మ నేతృత్వంలో ఎస్. శ్రీనివాస శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7గం.లకు ఆర్యవైశ్య పతాకావిష్కరణ చేశారు. 9 గంటలకు 102 మంది కన్యలచే గణపతిపూజ, అభిషేకము, హోమము, కుంకుమ పూజ, ఆర్యవైశ్య దంపతులచే గణపతిపూజ, పుణ్యాహవచనము, అమ్మవారికి పంచామృతా భిషేకము, సహస్ర నామపూజను జరిపించారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు నాళం చినబాబు, పల్చూరి శివరామకృష్ణ, దేవరశెట్టి వెంకటనర్సయ్య, పరమేశ్వరి యువగణేష్, ఆర్యవైశ్య మహిళామండలి, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసి యున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అర్చకులు బత్తినపాటి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు కన్యలు పూజలో పాల్గొన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఒరుగంటి చెన్నకేశవరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకట లక్ష్మి, చుండూరు సత్యనారాయణ, మేడం శివ తదితరులున్నారు.

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం


నేతాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య

రెంటచింతల: దేశ స్వాతంత్య్ర పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమైందని ఆయన జీవితం యువతకు ఆదర్శమని సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో హెచ్ఎం వెన్నా బుచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, అర్చకులు ఒరుగంటి మారుతీ శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన నేతల జీవిత చరిత్రలను ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులు వివరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిగురు చంద్రశేఖర్ శర్మ, విశ్రాంతి ఆర్మీ అధికారి ఉమా హరిహర శంకరరెడ్డి, విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధం

పిడుగురాళ్ల: పట్టణంలో ప్లాస్టిక్ బ్యానర్లను ఈ నెల 26 నుంచి నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ప్లాస్టిక్ బ్యానర్లను నిషేదించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్లాస్టిక్ బ్యానర్ల నిషేదంపై టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణ పరిధిలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, శానిటరీ సెక్రటరీ, మహిళా పోలీస్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులుగా ఉంటారని, ఆయా సచివాలయ పరిధిలో పూర్తి స్థాయి ప్లాస్టిక్ నిషేదంపై పర్యటించి తనిఖీలు నిర్వహించి, ప్రతి రోజు నివేదికలను మున్సిపల్ కార్యాలయంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు నివేదికలను అందించాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. పట్టణంలో ఎవరైనా ప్లాస్టిక్ బ్యానర్లను ఏర్పాటు చేసి ఉంటే ఈ నెల 26 లోపు స్వచ్ఛందంగా తొలగించాలని, లేని పక్షంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తొలగించడం జరుగుతుందని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

ఆర్టీసీ స్థలం అద్దెకు టెండర్లు ఆహ్వానం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 2178 చదరపు గజాలు,(45) సెంట్ల ఖాళీ స్థలానికి ఔత్సాహిక వ్యాపారవేత్తలకు 15 సంవత్సరాల పాటు అద్దె ప్రాతిపదికన తీసుకోవడానికి టెండర్లు ఆహ్వానించడం జరుగుతుందని డిపో మేనేజర్ ఎం. ముక్తేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ పూర్తి వివరాలకు ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు నెల్లూరు ఆర్ఎం ఆఫీసు కాన్ఫరెన్స్‌హాల్‌లో జరుగు సమావేశానికి హాజరు కాగలరని తెలియజేశారు. టెండరు ఫారం డౌన్‌లోడు చేసుకును ఆఖరి తేదీ ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం వరకు అని, టెండరు దాఖలు చేయుటకు చివరి తేదీ ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు అని, టెండర్‌ను నెల్లూరులోని ఈడీ కార్యాలయంలో దాఖలు చేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

గురజాల : రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గురజాల నుంచి అంబాపురం పోవు రహదారి మధ్యలో కోల్డ్ స్టోరేజ్ సమీపంలో ఆటో-కారు ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గురజాల నగర పంచాయతీ జంగమహేశ్వరపురంకు చెందిన కొండలు, అబ్దుల్లాగా గుర్తించారు. వారిని 108లో గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రజారోగ్యానికి చిరుధాన్యాలు సాగు చేయండి



కారెంపూడి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చిరుధాన్యాలే మేలైన వని వాటిని తినడం వల్ల మధుమేహంతో పాటు అనేక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఈ నేపథ్యంలో రైతులు చిరు ధాన్యాల సాగువైపు దృష్టి సారించాలని డీఆర్‌సీ డీడీఏ ఎం శివకుమారి కోరారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో సోమవారం రాత్రి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. వీటి సాగుకు ప్రభుత్వం అందించనున్న ప్రోత్సాహాన్ని వివరించారు. సాగర్ రాకమునుపు కొర్ర, అరికలు, వరిగె లాంటి చిరుధాన్యపు పంటలను పండించిన అనుభవం పల్నాడు రైతాంగానికి ఉందని గుర్తు చేశారు. ఆ తరం రైతుల అనుభవాలు, వాటిని తినడం వల్ల వారికి చేకూరిన ఆరోగ్యాన్ని గురించి తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈ పంటలను సాగు చేస్తున్న రైతులను అభినందిస్తూ వాటి సాగును లాభదాయకంగా ఎలా చేయాలనే దానిపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొర్రలు, అరికలు, అండుకొర్రలు, ఊదలు, సామెలు సాగు విధానం గురించి వివరించారు. సజ్జ, జొన్న, వరిగెల సాగు ఇప్పటికే పెరుగుతోందని దానిని మరింత పెంచాలని డీడీఏ పిలుపు నిచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు పి అరుణచంద్ర, బి యలమందారెడ్డి చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను వివరించారు.

విద్యుతాఘాతంతో వ్యక్తి మృతి

రెంటచింతల: మండలంలోని మంచికల్లులో విద్యుతాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సయ్యద్ షమీర్‌భాష సోమవారం తెలిపారు. మాచర్ల పట్టణానికి చెందిన భవననిర్మాణ కార్మికుడు తుమ్మల లక్ష్మయ్య(43) మంచికల్లు గ్రామంలో తాపీ పని చేయడానికి వచ్చి మిల్లర్‌కి నీళ్ల మోటర్ వేసే క్రమంలో విద్యుత్ ఘాతానికి గురికాగ మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతునికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షమీర్‌భాష తెలిపారు.

ప్రతి వార్డును సమష్టిగా అభివృద్ధి చేద్దాం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకుని ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పురపాలక సంఘ పాలక మండలి కృషి చేస్తోందని, అందుకు తన వంతు సహాయ సహకారాలందిస్తానని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 13వ వార్డులో రూ. 8 లక్షలతో పురపాలక సంఘ ఎదురు రహదారి నుంచి కేసిపికి వెళ్ళే రోడ్డును నిర్మించేందుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని అన్నీ వార్డులను అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికీ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం తరపున కృషి చేస్తానని పీఆర్కే తెలిపారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, కమిషనర్ ఈవి రమణబాబు, ఆయా వార్డు కౌన్సిలర్లు శంకర్, మందా సంతోష్, రామాంజనేయరెడ్డి, మాచర్ల చిన ఏసోబు, పోలా శ్రీను, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ వేముల కళ్యాణి, రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, వడ్డెర సంఘ నాయకులు బత్తుల రాజా, చల్లా కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ఎకరం భూమి విరాళం

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన మానుకొండ మార్కొండారెడ్డి సుజాత దంపతులు ఎకరం భూమిని కొనుగోలు చేసి శ్మశాన వాటికకు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం వివిధ సామాజిక వర్గాలకు, శ్మశానవాటికలకు పీఆర్కే భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శ్మశాన వాటిక సరిపోక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రైల్వే కాంట్రాక్టర్ మానుకొండ మార్కొండారెడ్డి సుజాత దంపతులు యకరం భూమిని రూ. 5.30 లక్షలకు కొనుగోలు చేసి శ్మశాన వాటికకు అప్పగించారన్నారు. మరో ప్రాంతంలో య. 5.60 సెంట్ల భూమిలో ముదిరాజ్, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలతో పాటు, గ్రామంలోని అన్నీ వర్గాలకు విడి విడిగా శ్మశాన వాటికలను కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఈడెబోయిన వెంకయ్య, అమరయ్య, నర్రావుల అయ్యన్న, హైకోర్టు అడ్వకేట్ మహేశ్వరరెడ్డి, పిన్నెల్లి వెంకట లక్ష్మారెడ్డి, తంగిరాల బుజ్జి, చింతా ఆదినారాయణ, తోట శివ తదితరులున్నారు.

గ్రామాల్లో సంక్షేమ పథకాలు వివరించండి

- పార్టీ గెలుపునకు అందరూ కృషి చేద్దాం
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుని సంక్షేమ పథకాలను అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ సరికొత్త విధానంతో ముందుకెళ్తుందని, దానికనుగుణంగా సచివాలయ పరిధిలోని పార్టీ వలంటీర్లు గ్రామ సారథులు కృషి చేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మాచర్ల పట్టణంలో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 7 నియోజక వర్గాల్లో ప్రతి ప్రాంతానికి సంబంధించిన సచివాలయాల పరిధిలోని మండల పార్టీ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా గృహ సారధులకు పూర్తి అవగాహన కల్పించి ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వలంటీర్ వ్యవస్థను తీసుకెళ్లడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయగలిగిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికి రూ. 5 లక్షల లబ్ధిని కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పూర్తి స్థాయిలో ప్రతి ఇంటికి వివరించి ప్రజలకు మేలు గురించి వివరించాలని ఆయన కోరారు. నెలలో సచివాలయ పరిధిలోని పార్టీ కన్వీనర్లు, గృహ సారధులు, ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ విధానాల గురించి లబ్ధిదారులకు వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి తెచ్చేందుకు క్షేత్ర స్థాయిలో కృషి చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా సచివాలయ, గృహ సారధులు ఇన్‌చార్జి కె రవీందర్‌రెడ్డి, నియోజక వర్గ ఇన్‌చార్జి పురుషోత్తం, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఆయా నియోజక వర్గ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు క్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండ రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి

దుర్గి: రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటును సంక్షేమాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు బాంధవుడుగా నిలిచారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రిసాయి మార్కొండారెడ్డి అన్నారు. సోమవారం ఆయన దుర్గి లోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి రైతు భరోసా కేంద్రాలు నిర్మించి రైతులకు అనేక పథకాలు ద్వారా మేలు చేకూర్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రైతు విధిగా ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని దీని ద్వారా రైతులు పంట నష్టం జరిగినప్పుడు ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతు బిందు సేద్యం ఉపయోగించుకుని సబ్సిడీ పొందవచ్చని, ఎరువులు ఇతర సేవలు ఉపయోగించుకుని రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన రైతు భరోసా కేంద్రంలోని రికార్డును పరిశీలించారు. ఈ- క్రాప్ నమోదును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పాల్వాయి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ కటకం గోపాల్, వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి, ఆదర్శ రైతు బీమా నాగేశ్వరరావు, విహెచ్ఎ కోటి నాయక్, వి ఏ ఏ రాఘవ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.